www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 21 జనవరి 2025



ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎఎస్‌పి సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. ఈ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మొత్తం 40 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేసి పోగొట్టుకున్న సొమ్ము సైబర్ పోలీసులు వెనక్కి తెచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు.

డాక్టర్ల కొరత.. అమ్మకు వ్యథ..!



- ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ప్రసూతి, పిల్లల విభాగంలో వేధిస్తున్న డాక్టర్ల కొరత
- 16 మంది ఉండాల్సిన చోట ఆరుగురు వైద్యులు
- ప్రతిరోజూ 150 వరకూ గర్భిణుల ఓపి,15కు పైగా ప్రసవాలు
- డాక్టర్ల కొరతతో గర్భిణులు ఎక్కువసేపు వేచిచూడాల్సిన పరిస్థితి
- పనిచేసే డాక్టర్లపై తీవ్ర ఒత్తిడి
- మెడికల్ కాలేజీలోని డాక్టర్లను సర్దుబాటు చేసే అవకాశం ఉన్నా పట్టించుకోరా?



ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఎంసిహెచ్ బ్లాక్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి, పిల్లల (ఎంసిహెచ్) బ్లాక్‌లో వైద్యుల కొరత కొత్త జన్మకు ప్రాణం పోసే అమ్మలకు తీవ్ర వ్యథను కలిగిస్తోంది. ఆసుపత్రికి వస్తున్న గర్భిణులకు అక్కడ సేవలందించే వైద్యుల సంఖ్యకు ఏమాత్రమూ సంబంధం లేకుండా పోయింది. దీంతో అక్కడి పనిచేసే వైద్యులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతున్న పరిస్థితి నెలకొంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి, పిల్లల ఆసుపత్రికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. జిల్లా ఆసుపత్రిగా ఉన్నప్పుడు నుంచి ఇక్కడకు వచ్చే గర్భిణులకు మంచి సేవలందించడంలో పేరొందింది. జిల్లాలోని నలుమూలల నుంచి ఇక్కడకు గర్భిణులు పెద్దఎత్తున వైద్యసేవల కోసం వస్తుంటారు. ప్రతిరోజు వైద్యులకు చూపించుకునే గర్భిణుల సంఖ్య సరాసరి 150 వరకూ ఉంటుంది. ప్రతిరోజూ 15 పైగా ప్రసవాలు జరుగుతుంటాయి. ఇందులో కొన్ని ఆపరేషన్ కేసులు, మరికొన్ని నార్మల్ డెలివరీలు ఉంటాయి. ఇంతమంది గర్భిణులకు, ప్రసవించిన తల్లులకు నాణ్యమైన సేవలు అందాలంటే సరిపడా డాక్టర్లు ఉండాలి. సర్వజన ఆసపత్రిలోని ఎంసిహెచ్ బ్లాక్‌లో అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. 16 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఆరుగురు మాత్రమే సేవలందిస్తున్నారు. డాక్టర్ల కొరతతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. వైద్యుల కొరత కారణంగా ఆసుపత్రికి వచ్చే గర్భిణులు గంటల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. గర్భిణులు అంతసేపు ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయివేటు ఆసుపత్రికి వెళితే ప్రసవాలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేస్తున్నారు. సామాన్య కుటుంబాలకు చెందిన వారు ఆర్థిక స్తోమత లేక ఏలూరు సర్వజన ఆసుపత్రికి వస్తున్నారు. పేదలకు వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతున్న పరిస్థితి నెలకొంది. కొత్త శిశువుకు జన్మనిచ్చే తల్లులకు సైతం సరైన వైద్యం అందించలేని పరిస్థితి ఉండడం దారుణంగా చెప్పొచ్చు. జిల్లా ఆసుపత్రి నుంచి బోధనా ఆసుపత్రిగా మారిన తర్వాత సౌకర్యాలు, పెద్ద ఎత్తున డాక్టర్లు వస్తారని జిల్లా ప్రజానీకం ఆశించారు. పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఉన్న కొద్ది మంది డాక్టర్లు అహర్నిశలూ శ్రమించి సేవలందిస్తున్నా విమర్శలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడ పనిచేసే వైద్యులు మానసిక ఒత్తిడికి గురవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. వెంటనే ప్రసూతి, పిల్లల ఆసుపత్రికి సంబంధించి వైద్యుల కొరత లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆసుపత్రి సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గర్భిణులకు సంబంధించి ఇబ్బందులను వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపైనా ఉంది.

డాక్టర్ల సర్దుబాటులో నిర్లక్ష్యమా..

ఏలూరు సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి, పిల్లల బ్లాక్‌లో డాక్టర్ల కొరత ఉందని అధికారుల నుంచి అందరికీ తెలిసిందే. గర్భిణులకు సంబంధించి ఎటువంటి నిర్లక్ష్యం జరిగినా తల్లీ బిడ్డకు సైతం ప్రమాదం ఏర్పడుతోంది. ఏలూరు మెడికల్ కాలేజీలో సరిపడా వైద్యులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. అక్కడి వైద్యులను ఇక్కడ సర్దుబాటు చేసి ఎందుకు సేవలు అందించలేకపోతున్నారో అర్థంకావడం లేదు. అంతేకాకుండా వేరే ఆసుపత్రిలో ఉన్న వైద్యులను అవసరం నిమిత్తం కేటాయించి సేవలందించే అవకాశాన్ని పరిశీలించని పరిస్థితి నెలకొంది. రోగులకు వైద్యసేవలు అందించేందుకు సరైన ప్రణాళిక లేకపోవడమే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు డాక్టర్ల కొరతపై దృష్టి సారిస్తే ఎంతోమంది తల్లులకు మేలు జరుగుతోంది.

ఇలా ఉంటే పిల్లలు కనడం ఎలా..?

ఇటీవల ముఖ్యమంత్రి సంతానం పెంపుపై ఎక్కువగా మాట్లాడుతున్నారు. యువత సంఖ్య తగ్గిపోతోందని, ఇద్దరికిపైగా పిల్లలు కనాలంటూ చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకూ ప్రయివేటు ఆసుపత్రిలో చూపించుకుంటే రూ.రెండు లక్షల వరకూ ఖర్చవుతోంది. ప్రభుత్వాసుపత్రికి వెళ్దామంటే అక్కడ డాక్టర్ల కొరత, సౌకర్యాలలేమి వెంటాడుతోంది. ప్రభుత్వ వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందించకుండా.. పిల్లల కనండంటూ మాట్లాడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కలెక్టరేట్ ధర్నా చేస్తున్న సహకార ఉద్యోగులు

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎపి అగ్రికల్చరల్ కోపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు. సొసైటీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రాట్యూటీ చెల్లించాలని, ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు టి.గంగరాజు, జిల్లా అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ మాట్లాడుతూ 2019లో జారీ చేసిన జిఒ 36ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎసిఎస్‌లకు డివిడెంట్లు ఇవ్వకుండా, సిబ్బంది వేతనాల ఖర్చుల్లో తమ వాటాలు భరించకుండా డిసిసిబి, ఆప్కాబ్‌లు కాలక్షేపం చేస్తున్నాయని విమర్శించారు. ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 2019, 2024 వేతన సవరణ వెంటనే చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాలను మొత్తం వ్యవస్థను ప్రయివేట్ పరం చేసేందుకు మోడీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రయత్నిస్తోందని, ఆ విధానాలనే రాష్ట్రంలో అధికారంలో ఉన్నవారు కూడా అమలు చేస్తూ సహకార సంఘాలకు ఎసరుపెట్టే ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులందరికీ చట్టప్రకారం గ్రాడ్యూటీ చెల్లించాలని కోరారు. సంఘాల్లో సిబ్బందిని కుదించే ఆలోచనలను ప్రభుత్వాలు మానుకోవాలని హితవు పలికారు. సహకార సంఘాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే ప్రయత్నాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రాజు, సిహెచ్.సుందరయ్య, కె.విజయలక్ష్మి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బారావు, వీరయ్య, రాధాకృష్ణ, సర్వేశ్వరరావు, వలీ, అమర్నాథ్ నాయకత్వం వహించారు.

కేంద్రం రైతులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

ఎంపీ కార్యాలయ సిబ్బందికి నేతల వినతి



ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలో మోడీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, గత 56 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లెవాల్ ప్రాణాలను కాపాడాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తి పిలుపు మేరకు సోమవారం ఏలూరు శాంతినగర్‌లోని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయానికి రాయబార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం (అన్నే భవనం) రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు సంఘం (స్ఫూర్తి భవనం) రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కె.గౌస్ మాట్లాడారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లెవాల్ 56 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. ఫిబ్రవరి 15న చర్చలు జరుపుతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం సమంజసంగా లేదన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలపై వెంటనే చర్చలు జరిపి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ల ప్రయివేటీకరణ చర్యలు ఆపాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని ఎంపీ కార్యాలయ అధికారి కుమారు స్వామి ద్వారా అందజేశారు. కార్యక్రమంలో వివిధ రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కట్టా భాస్కరరావు, కొమ్మన సాంబశివరావు, పి.పెంటయ్య, బుగ్గల ప్రభాకరరావు, బళ్ల కనక దుర్గారావు, అరిగెల యోహాన్, దారం యోహానురాజు, మానుకొండ వీర్రాజు పాల్గొన్నారు.

గ్రామాలను దత్తత తీసుకోండి

జిల్లా, మండల అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు

విద్య, వైద్యం, ఉపాధి, పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, మౌలిక సదుపాయాలు కల్పన, అక్షరాస్యత పెంపుదల వంటి అంశాలతో ఒక గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు జిల్లా, మండల అధికారులు గ్రామాలను దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపు ఇచ్చారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో గ్రామాల దత్తతపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రతి జిల్లా, మండల అధికారులు జిల్లాలోని ఒక గ్రామాలను దత్తత తీసుకొని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఆదర్శ గ్రామాల దత్తత అధికారులు తమ పరిధిలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని ఆ గ్రామంలోని ప్రతి కుటుంబం జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఎంచుకున్న గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్ల నిర్మాణం, ఇద్దరు మౌలిక సదుపాయాలకు అవసరమైన సహకారాన్ని తాము అందిస్తామన్నారు. ముందుగా దత్తతకు ఎంపికకు తీసుకున్న గ్రామాల్లో గ్రామ సభ ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసేందుకు వాస్తవ సమాచారాన్ని సేకరించడంతోపాటు, ప్రజలకు కావాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకోవాలన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

గ్రామ అభివృద్ధికి, సామాజిక అభివృద్ధికి సహకరించాలన్నారు. విద్య వైద్యం పారిశుధ్యం, స్థిరమైన జీవనోపాధి కమ్యూనిటీ మౌలిక సదుపాయాల లభ్యత మొదలైన సమస్యల పరిష్కారం, అక్షరాస్యత పెంపుదల మహిళా సాధికారతకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకున్న అధికారులు ఆచా గ్రామాల్లో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా అమలు జరిగేలా పర్యవేక్షించాలన్నారు. గ్రామంలో నిరుద్యోగ యువత వివరాలను సేకరించి, వారికి అభిరుచి కలిగిన అంశాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్నారు. గ్రామంలో తాగునీటి, పారిశుధ్యం, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు పూర్తిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

సిపిఎం, ప్రజాసంఘాల కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. మండల కేంద్రమైన టి.నరసాపురం పాత పెట్రోల్ బంక్ ఎదురుగా సిపిఎం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల కార్యాలయాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి చేతులమీదుగా సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రవి మాట్లాడుతూ మండలంలో సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం ఐద్వా, కెవిపిఎస్, ఎస్‌ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, బాలల సంఘాలకు అనుబంధంగా కార్యాలయం పని చేస్తుందన్నారు. ప్రజా సంఘాల పోరాటాలకు కేంద్ర బిందువుగా కార్యాలయం పని చేస్తుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజా సంఘాల దృష్టికి తీసుకురావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులు కాల రాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక హక్కులను కాపాడుకోవడానికి మండలంలో జరుగుతున్న భూ పోరాటాలకు కేంద్రంగా ప్రజా సంఘాల కార్యాలయం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో మండలంలో ప్రజా సమస్యలు, కార్మికుల హక్కుల కోసం, భూపోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.మాణిక్యం, నాయకులు అనుమోలు మురళీ, సీతారామయ్య, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.విజయలక్ష్మి, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మడకం సుధారాణి, మడకం కుమారి, బరగడ కుమారి, జి.వెంకట్రావు, సోయం భవాని, తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ప్రారంభిస్తున్న రవి

పిజిఆర్ఎస్‌కు 247 అర్జీలు

ప్రతి అర్జీకీ అర్థవంతమైన సమాచారం ఇవ్వాలి : కలెక్టర్ వెట్రిసెల్వి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు


ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలకు అర్థవంతమైన పరిష్కారం చూపుతూ అర్జీదారుని సంతృప్తి స్థాయి పెంచేదిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అర్జీలు స్వీకరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.ముక్కంటి, కె.భాస్కర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 247 అర్జీలు అందినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్జీల పరిష్కార తీరును సిఎంఒ కార్యాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ పరిశీలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

మెగా జాబ్ మేళాలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాష్ట్రంలో రానున్న ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని యువతకు అమరరాజా కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆగిరిపల్లి సమీపంలోని గోపాలపురం ఎన్‌ఆర్ఐ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాబ్ మేళాలో పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, చదివిన సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొనగా వారికి అమర్ రాజా సంస్థ ప్రతినిధులు ఇంటర్వ్యూ నిర్వహించి వారిలో సుమారు 120 మందికి ఉద్యోగ నియామక పత్రాలను మంత్రితో కలిసి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగాల కోసం కంపెనీల చుట్టూ తిరిగే అవసరం లేకుండా కళాశాలల్లోనే జాబ్‌మేళాలు నిర్వహించి పలు సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో స్కిల్‌హబ్‌లు ఏర్పాటుచేసి, యువతకు అన్ని రంగాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్ఐ కళాశాల ఛైర్మన్ ఆర్.వెంకట్రావు, అమర్ రాజా కంపెనీల ప్రతినిధులు, కళాశాల సిబ్బంది, రాజేంద్ర, సాంబశివరావు, రోశయ్య, టిడిపి నాయకులు ఎన్.వేణు, రఘు, ఆది, గణేష్, మాధవరావు, మహేంద్ర వర్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి

పర్యాటక విస్తరణకే పర్యటన

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి - పోలవరం

గిరిజన ప్రాంతాల్లో పర్యాటక విస్తరణ చేయడం కోసమే పర్యటన చేస్తున్నట్లు ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి పోలవరం ప్రాజెక్టుకు చేరుకున్న ఆయన అక్కడి నుంచి అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పోశమ్మగండి ప్రాంతానికి చేరుకున్నారు. ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, రంపచోడవరం సిఐ సాయిప్రశాంత్, పోలవరం సిఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పర్యాటకం అభివృద్ధి చేయడం వల్ల ప్రాజెక్టు నిర్మాణంలో నష్టపోయిన స్థానికులకు వ్యాపార వాణిజ్యాలు పెరిగి కొంతమేర న్యాయం జరుగుతుందని ఎస్‌టి కమిషన్ ఛైర్మన్‌కు వివరించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలందిస్తానని ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ హామీ ఇచ్చారు.



శంకరరావుకు స్వాగతం పలుకుతున్న ఎంఎల్‌ఎ

పంగిడిగూడెం భూ లబ్ధిదారులకు న్యాయం చేయాలి

రైతు సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం డి ఫారం భూమి లబ్ధిదారులకు న్యాయం చేయాలని, వారి పేరున భూమి ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. తమ పట్టాలు తమకు ఇప్పించాలని, మా భూములు ఆన్ లైన్ చేయాలంటూ పేద రైతులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు మాట్లాడారు. 2005లో పేదలకు డి ఫారం పట్టా భూములు 25 సెంట్ల చొప్పున పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఆ భూములు ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయకపోవడంతో వ్యవసాయ పెట్టుబడి సాయం, పంట రుణాలు, ఇతర వ్యవసాయ ప్రభుత్వ పథకాలు వీరికి అందడం లేదన్నారు. ఈ భూములకు తగిన సాగునీటి వసతి లేదని, వెంటనే బోర్లు సౌకర్యం కల్పించాలన్నారు. పంగిడిగూడెం డి-ఫారం భూముల లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ధర్నా అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పి.సుభాష్ చంద్రబోస్, మానుకొండ వీర్రాజు, వి.కొండమ్మ, డి.లక్ష్మి, ఎల్.కనకమ్మ, బి.కుమారి, డి.ఏసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


ధర్నా చేస్తున్న ప్రణీత

ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పెళ్లి చేసుకోకుండా మోసం చేశాడని యువకుడి ఇంటి ముందు యువతి ధర్నాకు దిగింది. ఆమె తెలిపిన ప్రకారం... మండలంలోని అరుంధతికాలనీకి చెందిన మద్ది ప్రణీతను అదే గ్రామానికి చెందిన ఉండ్రు నవీన్‌కుమార్ ప్రేమిస్తున్నానని చెప్పాడు. ప్రణీతకు 18 ఏళ్లు నిండిన తర్వాత పెళ్లి చేసుకుంటానని చెప్పి గోడేటి విజయవాడ తీసుకెళ్లి ఒక ప్రైవేట్ రూమ్‌లో ఉంచాడు. నాలుగైదు రోజుల తర్వాత నవీన్‌కుమార్ ప్రణీతను పెళ్లి చేసుకుంటానని చెప్పి తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఐదు నెలలు ఉన్న అనంతరం నా కుటుంబీకులు ఒప్పుకోవడంలేదని, పెళ్లి చేసుకోవడం కుదరదని, నువ్వు మీ ఇంటికి వెళ్లిపోవాలని ప్రణీతతో చెప్పి గెంటివేశాడు. పెళ్లి చేసుకోవాలని అడిగిన వరకు తల్లి, చిన్నపిల్లలు నవీన్ కుటుంబీకులు దాడి చేసి బయటకు నెట్టేశారని ప్రణీత తెలిపింది. తాను మోసపోయానని తెలుసుకుని సోమవారం నవీన్ ఇంటి ఎదుట ప్రణీత ధర్నాకు దిగింది. తనను పెళ్లి చేసుకునేంత వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని, తనకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన కొనసాగిస్తానని ప్రణీత చెప్పింది.

సొసైటీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

సహకార సంఘాల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కె.జగ్గవరం సొసైటీ సిఇఒ, తనగాల వీర వెంకయ్య డిమాండ్ చేశారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద సహకార సంఘాల ఉద్యోగులు చేస్తున్న ధర్నాకు మండలంలోని ఐదు సొసైటీల ఉద్యోగులు సోమవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ. నెంబర్ 36 అమలు చేయాలని, ఉద్యోగుల వయో పరిమితి పెంచాలని, వేతన సవరణ చేయాలని, డిఎల్‌ఎస్‌ఎఫ్ అమలు చేయాలని, 2019 మార్చి తరువాత తీసుకున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలని, పశ్చిమ గోదావరి జిల్లా డిసిసిబి బిరో కేడర్ ఉద్యోగ నియామకం ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సహకార రంగాన్ని ప్రైవేట్ పరం చేయవద్దని, షేర్ ధనంపై డివిడెంట్ ఇవ్వాలని, అన్ని రకాల రుణాల మంజూరు చేయాలని, డిసిసిబి డైరెక్ట్ లోన్లు నిలుపుదల చేయాలని, షేర్ ధనంలో సహకార సంఘాలకు వాటా ఇవ్వాలని డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ధర్నాకు తరలి వెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఇఒలు కెవిఎ.సత్యనారాయణ, యువివి.సత్యనారాయణ, జి.బుజంగారావు, సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ టీచర్లకు శిక్షణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


మాట్లాడుతున్న సత్యనారాయణ

మండలంలోని వెలుగు ఆఫీస్‌లో ఉల్లాస్ వయోజన విద్య సక్సెస్ కార్యక్రమం, రెండో సెషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఉల్లాస్ వయోజన విద్య సక్సెస్, ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో జిల్లా వయోజన విద్య నోడల్ ఆఫీసర్ కెవిఎ. సత్యనారాయణ పాల్గొని వాలంటీర్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రకాష్, ఇఒపిఆర్‌డి, ఎపిఎం అరవింద, హెచ్‌డి సీసీ గౌరీశంకర్, సీసీలు శ్రీనివాస్, స్వరూపరాణి, ఉల్లాస్ విఒలులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్స్ పోస్టులను భర్తీ చేయాలి సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో ఉన్న ఏరియా ఆసుపత్రి స్థాయి 50 పడకల పెంచి 23 మంది డాక్టర్స్ పోస్టులను శాంక్షన్ చేయగా ఇక్కడ 12 మంది మాత్రమే పనిచేస్తున్నారని, మిగతా 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని కోరుతూ సిపిఐ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, నగర కమిటీ సభ్యులు ఎస్‌కె.కాలేశా, తాడిగడప మాణిక్యాలరావు, మార్త అమ్ములు, శ్రీరాముల రామకృష్ణ, మానేపల్లి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువుల ధరల పెంపు దారుణం

ప్రజాశక్తి - కుక్కునూరు

కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచడం దారుణమని రైతు సంఘం (సిపిఐ అనుబంధం) నాయకులు అన్నారు. ఎరువుల ధరలు తగ్గించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ మండల వ్యవసాయ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ ఎరువుల ధరాలు పెంచడంతో రైతులపై విపరీత భారం పడుతుందని వాపోయారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ముడి సరుకుల ధరలు పెరిగాయని కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెంచడం తగదన్నారు. పురుగు మందుల షాపులపై పర్యవేక్షణ లోపించడంతో నకిలీ పురుగు మందుల విక్రయం పెరిగిందన్నారు. పురుగు మందుల షాపులను తనిఖీ చేసి అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మండల వ్యవసాయాధికారి బాలాజీకి నాయకులు వినతిపత్రం అందించారు. ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటను దళారులు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్క్ ఫెడ్ ఏర్పాటు చేసి రైతుల నుంచి నేరుగా మిర్చి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, మండల నాయకులు నకిరికంటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సోమయ్య మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

బడుగు సోమయ్య మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ ముద్రబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఇటీవల కాలంలో మండల పరిధిలోని చిన్నాగిరిపల్లికి చెందిన టిడిపి నూజివీడు నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు బడుగు సోమయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సోమవారం చిన్నాగిరిపల్లిలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సోమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.మంగయ్య, ఆర్.కొండలరావు, పి.రామకోటి, ఎ.నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

జామాయిల్ ట్రాక్టర్ బోల్తా

డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్డును తడపకపోవడంతో దుమ్ము లేచి ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడకపోవడంతో ఇటీవల నాలుగు కార్లు, రెండు ట్రాక్టర్లు బోల్తాబడ్డాయి. వాహనదారులు, డ్రైవర్లు గాయాల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఆదివారం జామాయిల్ ట్రాక్టర్ బోల్తా పడటంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మట్టి ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సాగునీటి చెరువుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. పరింపూడి, దిప్పకాయలపాడు రెవెన్యూ పరిధిలోని సాగునీటి చెరువుల్లో జెసిబిలను పెట్టి మట్టిని ట్రాక్టర్ ట్రక్కులతో తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో మట్టిని రవాణా చేస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కి తరలించామని ఎస్ఐ తెలిపారు.

జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా గణతంత్ర దినోత్సవ వేడుకలు

సకాలంలో ఏర్పాట్లను పూర్తి చేయాలి
కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు: జాతీయ స్ఫూర్తి ప్రస్ఫుటించేలా, పండుగ వాతావరణంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి ఈ నెల 26వ తేదీన ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించి శాఖల సమన్వయంతో సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వేడుకల నిర్వహణకు నిర్దేశించిన మినిట్ టు మినిట్ అనుసరించి ఏర్పాట్లు ఉండాలన్నారు. అలాగే ప్రధాన వేడుకల సంబంధించిన ఏర్పాట్లు ప్రోటోకాల్‌కు అనుగుణంగా రూపొందించాలన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ స్ఫూర్తి, సమగ్రత ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై హౌసింగ్, పశు సంవర్ధకశాఖ, ఐసిడిఎస్, మెప్మా, విద్యాశాఖ, ఉద్యానశాఖ, వ్యవసాయం, మత్స్యశాఖ, ఐటిడిఎ కెఆర్.పురం, రీసర్వే (రెవెన్యూ సదస్సులు, పిజిఆర్ఎస్) పది స్టాల్స్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేదిక పుష్పాలంకరణకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా ఉద్యానవన శాఖ, మెప్మా పీడీ పర్యవేక్షించాలన్నారు. ఆయా శాఖల్లో ఉత్తమ పనితీరు కనబరిచే అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించేందుకు ఈ నెల 23వ తేదీలోగా జిల్లా రెవెన్యూ అధికారికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. శానిటేషన్, తాగునీరు ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ పర్యవేక్షించాలన్నారు.

డిపాజిట్ ఖతాలపై అవగాహన అవసరం

జిల్లా లీడ్ మేనేజర్ డి.నీలాద్రి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజలంతా డిపాజిట్ ఖాతాల గురించి తెలుసుకోవాలని, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని జిల్లా లీడ్ మేనేజర్ డి.నీలాద్రి తెలిపారు. స్థానిక ఎస్‌విఆర్‌కె డిగ్రీ కళాశాలలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ పర్యవేక్షణలో వర్క్ షాపు నిర్వహించారు. ఎస్‌బిఐ బిఎం.బి.రాజా మాట్లాడుతూ సైబర్ క్రైమ్ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సోషల్ మీడియా, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, మోసపూరిత ఈ మెయిల్స్ పట్ల జాగ్రత్త వహించి నష్టపోకుండా ఉండాలని, ముఖ్యంగా విద్యార్థులందరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎం.హైందవి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. పిఎం జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి స్కీమ్స్ నమోదు చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఫోల్డర్లలో చేర్చుకోవాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలన్నారు. బ్యాంకింగ్ సేవలను తెలివిగా వినియోగించుకోవాలన్నారు. ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ పంకజ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహన్ సైబర్ నేరాలను వివరించారు. ఈ వర్క్‌షాపులో రిసోర్స్ పర్సన్లు వై.బాబూరావు, ఎన్.అనిల్, బి.సుమంత్, బి.చెన్నారావు పాల్గొని బ్యాంకు ఖాతా తెరవడం, లావాదేవీలు నిర్వహించడం, డిపాజిట్ ఖాతాలతో కలిగే అదనపు ప్రయోజనాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ స్కీం డిజిటల్ ట్రాన్సాక్షన్స్, ఇతర చెల్లింపు వ్యవస్థలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సమావేశానికి బాధ్యులు, సభ్యులందరూ హాజరవ్వాలి

భీమడోలు సర్వసభ్య సమావేశంలో ఎంపిపి రామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రామయ్య

భీమడోలు: మండలాభివృద్ధిపై మూడు నెలలకో సారి జరిగే మండల పరిషత్‌లో సర్వసభ్య సమావేశానికి బాధ్యులు, సభ్యులు తక్కువ సంఖ్యలో హాజరు కావడం సరికాదని, వచ్చే సమావేశం నాటికి లోపాన్ని సరిదిద్దుకోవాలని భీమడోలు ఎంపిపి కె.రామయ్య కోరారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ పద్మావతి దేవి ఆధ్వర్యంలో ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు భవానీ రంగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల పరిషత్ వద్ద అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.1.50 కోట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఒక్కొక్క మండల ప్రాదేశిక నియోజకవర్గంలో ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారం, మురుగునీటి పారుదల వ్యవస్థ, అనుసంధాన రోడ్లకు రూ.ఐదు లక్షల వరకు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇక రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మిగిలిన నిధులతో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తున్నట్లు తెలిపారు. భీమడోలు గ్రామీణ నీటి సరఫరా పథకం ఎఇ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గోదావరి గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా ధవళేశ్వరం నుంచి గోదావరి జలాలు తాగునీటిగా అందించే కార్యక్రమం చురుకుగా కొనసాగుతుం దన్నారు. కొందరు సభ్యులు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నవారికి బిల్లులు రావడం లేదని సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన భీమడోలు గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజినీర్ మాట్లాడుతూ మండల పరిధిలో ఈ తరహా గృహాలు 1500 వరకు ఉన్నట్లు తమ శాఖ చేసిన సర్వే ద్వారా గుర్తించామన్నారు. వీరికి బిల్లుల చెల్లింపునకు అవసరమైన నిధుల మంజూరుతో పాటు అనుమతులు రావాల్సి ఉందని తెలిపారు. అటవీ శాఖాధికారి మాట్లాడుతూ కొల్లేరు అభయా రణ్య పరిధిలో అక్టోబర్, ఏప్రిల్ నెల మధ్య సాంప్రదాయ రీతిలో చేపల వేటకు లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. మత్స్య అభివృద్ధి శాఖాధికారి భవాని మాట్లాడుతూ ఆక్వా రైతులు తమ చెరువులకు లైసెన్సులు తీసుకోవాలని చెప్పారు. తహశీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ మండలంలో భూముల రీసర్వే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రెవెన్యూ గ్రామసభల సందర్భంగా వచ్చిన దరఖాస్తుల్లో 70 శాతం వరకు సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు.

పశువుల మృతిపై విచారణ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాజవరంలో కలుషిత నీరు తాగి మృతి చెందిన పశువుల ఘటనపై పశుసంవర్ధక శాఖ ఎడి సోమశేఖర్ సోమవారం విచారణ నిర్వహించారు. రాజవరం గ్రామానికి ఆయన వైద్యశాఖాధికారులతో చేరుకుని ఏడు పశువుల మృతికి సంబంధించిన వివరాలను బాధిత రైతు నుంచి, అదేవిధంగా కలుషిత నీరు కావడానికి కారణమైన వ్యక్తుల నుంచి ప్రాథమిక విచారణ చేశారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని జంగారెడ్డిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్.రంగనాయకులు అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆటో, ట్యాక్సీ, లారీ డ్రైవర్, క్లీనర్ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన పలు సూచనలు చేశారు.

షోకాజ్ నోటీసులు జారీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇటీవల కాలంలో జరిగిన భూముల కంప్యూటరీకరణకు సంబంధించి పెద్ద ఎత్తున అవినీతి జరగడంతో పాటు పిజిఆర్ఎస్‌లో పలువురు ఫిర్యాదు చేయగా కార్యాలయంలో పని చేస్తున్న ఆర్ఐ జ్యోతికి, కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న అనిల్‌కు జిల్లా కలెక్టరేట్‌లో హాజరు కావాలని షోకాజ్ నోటీసులు అందినట్లు ఇన్‌ఛార్జి తహశీల్దార్ జి.ఉదయభాస్కర్ తెలిపారు. వారిని మంగళవారం ఉదయం కలెక్టరేట్‌కి హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నట్లు తెలిపారు.

మిర్చి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - ముసునూరు

మిర్చి పంట సాగు చేస్తున్న రైతులందరూ సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి నల్ల తామర, నల్లి పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. మండలంలోని వలసపల్లి గ్రామంలో మిర్చి సాగులో సస్యరక్షణ చర్యల్లో భాగంగా నల్లి, తామర పురుగుల నివారణ కోసం ఉద్యానవన శాఖ అధికారి కె.జ్యోతిప్రియాంక ఆధ్వర్యంలో సోమవారం క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ మిర్చి సాగు చేస్తున్న రైతులందరూ సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సమగ్ర ఎరువుల యాజమాన్యం పట్ల రైతులు సరైన మోతాదులో మాత్రమే ఎరువులు వేయాలని, యూరియా, పొటాష్ నాలుగు విడతల్లో వేయాలని చెప్పారు. మండల ఉద్యానవన శాఖ అధికారి కె.జ్యోతిప్రియాంక మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ మిర్చి సాగులో అధిక దిగుబడులు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సూరిబాబు, గ్రామ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన రైతు బజార్ నిర్మాణానికి కృషి

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన రైతు బజార్ నిర్మాణానికి ఆలోచన చేస్తున్నట్లు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఇటీవల ఏలూరు ట్రాఫిక్ సిఐ ఎస్.లక్ష్మణరావుతో సమావేశమైన ఆయన ఏలూరు పత్తేబాద రైతుబజార్ వద్ద నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏలూరు పత్తేబాదలోని పొట్టి శ్రీరాములు రైతుబజార్‌ను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్ లోపల వ్యాపారాలకు కేటాయించిన స్థలాలకు మించి కొనుగోలుదారులు నడిచే మార్గంలో సైతం వ్యాపారాలు సాగిస్తూ ఉండడంతో వారికి పలు సూచనలు చేశారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే వ్యాపారులు తమ వ్యాపారాలను సాగించాలని సూచించారు. మార్కెట్‌లో నిరుపయోగంగా, ఖాళీగా ఉన్న షెడ్లను పరిశీలించిన ఆయన అక్కడ కూడా వ్యాపారులకు షాపులు కేటాయించాలని అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో నూతన రైతుబజార్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులను అంచనా వేయడంతో పాటు స్థలాన్ని కూడా పరిశీలించారు.

భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

టి.నరసాపురం: భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ టి.సాయిబాబా తెలిపారు. రీసర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని కృష్ణారావుపాలెంలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వే నిర్వహించేందుకు మండలంలో కృష్ణారావుపాలెన్ని ఏడో గ్రామంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. మొత్తం 500 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ గ్రామానికి గత పది నుంచి 20 వరకు సరిహద్దుల కొలతలు పూర్తి చేశామన్నారు. రైతులకు ముందస్తుగా నోటీసులు అందించి వారి సహకారంతో భూములను సర్వే చేపడతామని తెలిపారు. రీసర్వే ద్వారా భూములు ఎక్కువ తక్కువలు, రికార్డుల్లో తప్పులు అన్ని సరి చేయనున్నట్లు వివరించారు. రీ సర్వేకు రైతులందరూ సహకరించాలని సర్వేకు రైతులు ఆధార్, భూహక్కు పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి స్రవంతి, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


ఉపాధ్యాయులు విద్యను బోధించడంతో పాటు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సహాయ సహకారాలను అందించడం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి ఎంఇఒ కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఈదులగూడెం ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న అదే గ్రామానికి చెందిన షేక్ రఫియా బేగం తలసేమియా వ్యాధితో బాధపడుతూ విజయవాడ ఆంధ్రహాస్పిటల్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొంతుతుంది. ఆ పాప తల్లి ఆ పాఠశాలలోనే ఆయాగా పనిచేస్తుంది. పాపకు తండ్రి లేకపోవడం పేదరికంలో కొట్టు మిట్టాడుతున్న సదరు కుటుంబానికి ఆగిరిపల్లి మండల ఎస్‌టియు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, నాయకులు కలిసి రూ.1,14,612 నగదును సేకరించి ఆ పాప తల్లికి అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు సిహెచ్.సురేష్ కుమార్, టి.నరసింహారావు, ఎం.వేణుగోపాలరావు, ఎ.వెంకటేశ్వరరావు, అబ్దుల్ హక్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మెరుగైన ఆహార నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మెరుగైన ఆహార నియమాలే ఆరోగ్య సంరక్షణకు ప్రాథమిక సూత్రాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హితవు పలికారు. మెడికల్ కాలేజీ అనుసంధానంగా ఉన్న ఏలూరు సర్వజనాసుపత్రిలో మరింత సమర్థవంతమైన వైద్యవిధానాన్ని అవలంభించేందుకు, ప్రజలకు అవసరమైన ఆరోగ్య సూత్రాలను అందించేందుకు, పూర్తిస్థాయిలో ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించేందుకు ఆసుపత్రి ప్రాంగణంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వెల్‌నెస్ క్లినిక్‌ను ఎంఎల్ఎ సోమవారం ప్రారంభించారు. ముందుగా ఆసుపత్రికి విచ్చేసిన ఎంఎల్ఎకు ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వెల్‌నెస్ క్లినిక్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. క్లినిక్‌లో కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఉపయుక్తంగా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. మెరుగైన ఆహార నియమాలే ఆరోగ్య సంరక్షణకు కీలమన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఒడి, వెల్‌నెస్ క్లినిక్ ఇన్‌ఛార్జ్, ప్రొఫెసర్ డాక్టర్ జి.గంగాభవాని మాట్లాడుతూ ప్రతి సోమ, బుధవారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ క్లినిక్‌లో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సావిత్రి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజు, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ కె.భాస్కర్, ఎం.శశిధర్, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, కమ్యూనిటీ మెడిసిన్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలతో రైతులకు మేలు


ముదినేపల్లిలో...

ప్రజాశక్తి - ముదినేపల్లి

పశుఆరోగ్య శిబిరాలతో రైతులకు, పశు పోషకులకు ఎంతో మేలు చేకూరుతుందని ముదినేపల్లి, ప్రొద్దువాక వెటర్నరీ డిస్పెన్సరీల పశు వైద్యాధికారులు యు.క్రాంతికుమార్, ఆరేపల్లి రామకృష్ణ అన్నారు. మండలంలో సోమవారం పశుఆరోగ్య శిబిరాలు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రొద్దువాక డిస్పెన్సరీ పరిధిలో బొమ్మినంపాడు, ముదినేపల్లి డిస్పెన్సరీ పరిధిలో ముదినేపల్లిలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాలు పశుపోషకులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బొమ్మినంపాడు, ముదినేపల్లి గ్రామాల్లో జరిగిన పశు ఆరోగ్య శిబిరాల్లో పశువులకు, జీవాలకు నట్టల నివారణ మందులు, టీకాలు, వాతంపొడి ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు.

ద్వారకాతిరుమల : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలో ఈ నెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ప్రతిరోజూ ఒక గ్రామంలో పశు వైద్య శిబరాలను నిర్వహించనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్ తెలిపారు. సోమవారం దొరసానిపాడు, సాయంపాలెం గ్రామాల్లో శిబిరం ఏర్పాటు చేసి 30 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందించినట్లు తెలిపారు. 69 పశువులకు నట్టాల నివారణ మందులు ఉచితంగా ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, జి.కొత్తపల్లి పశు వైద్యధికారి డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో...

కొయ్యలగూడెం : మండల పరిధిలోని పరింపూడి రైతు సేవా కేంద్రం-1లో పశు ఆరోగ్య శిబిరం కార్యక్రమంలో ఎంపిపి గంజిమాల రామారావు, ఘంటసాల శీనమ్మ, వార్డు మెంబర్ పూలపల్లి రవికుమార్ చేతులమీదుగా పశువైద్య శిబిరాలు ప్రారంభించారు. ఈ శిబిరాలు ఈ నెల 31వ తేదీ వరకు 11 రోజుల పాటు నిర్వహించనున్నట్లు వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ బిఆర్.శ్రీనివాసన్ తెలిపారు. మొదటి రోజున 13 మంది రైతులు తమ పశువులను శిబిరానికి తీసుకొచ్చారన్నారు. మొత్తం 18 ఆవులు, 71 గేదెలు, 50 దూడలకు నట్టల నివారణ మందులు అందించినట్లు చెప్పారు.

రాజాబాబును కలిసిన రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

అర్హులందరికీ సొంత ఇంటి కల నెరవేర్చాలని గృహ నిర్మాణ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజాబాబును చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ కోరారు. పి.రాజాబాబును ఎంఎల్ఎ విజయవాడలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మూడు సెంట్లలో ఇంటి నిర్మాణం చింతలపూడి నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ఇవ్వాలని ఎంఎల్ఎ కోరారు. దీనిపై రాజాబాబు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

ఒకటో పట్టణ పరిధిలోని కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 21వ తేదీ ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కెఎం.అంబేద్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలోని వెన్నవల్లివారిపేట, నవాబ్‌పేట, సత్యనారాయణపేట, భావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, కెనాల్ రోడ్డు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అంబేద్కర్ కోరారు.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) నర్సాపురం వారి కోర్టులో
O.S. No. 339/2023

Between:
పాముల ఏసు రత్నం ...వాది
మరియు
యర్రం దుర్గా ప్రసాద్ ...ప్రతివాది

టు:
యర్రం దుర్గా ప్రసాద్, S/o వెంకట రామారావు, కొత్తపల్లి సుబ్బారాయుడు హైస్కూలు వద్ద, రుస్తుంబాద, నర్సాపురం, నర్సాపురం మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీపై ప్రామిశరి నోటు బాకీ రాబట్టుకునే నిమిత్తం దావా దాఖలు చేయగా, సదరు దావాలో మీకు కోర్టు ద్వారా మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై నెంబరు దావాలో పేపరు ప్రకటన ద్వారా తెలియజేయు నిమిత్తం కోర్టు వారు ఆర్డరు వేసి యున్నారు. సదరు దావా **ది. 27-01-2025 తేదిన** మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి వున్నది. సదరు వాయిదా రోజు మీరు పై కోర్టు వారి యెదుట **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

సిరిపురపు రాజేశ్వర ప్రసాద్
నర్సాపురం అడ్వకేట్,
ది.18-01-2025 శ్రీ రాజరాజేశ్వరి నిలయం
నర్సాపురం, ప॥గో॥జిల్లా
సెల్: 93941 76662

మహారాజశ్రీ 7వ అదనపు జిల్లా జడ్జి
ఏలూరు, ప॥గో॥జిల్లా
A.S No. 81/2022

బిట్వీన్:
సాగిరాజు సాయికృష్ణ వర ప్రసాదరాజు మరియు 2 అదర్స్ ..అప్పిలెంట్సు
వలసపల్లి బాల వీర రాఘవయ్య మరియు ఇతరులు ..రెస్పాండెంట్సు

అప్పిలెంట్సు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల రెస్పాండెంట్సు 9 నుండి 11,15,17 మరియు 19 వారలయిన 9. తోట రమణ, W/o ఓడూరి విక్రమ్ రిప్రజంటెడ్ బై తోట లక్ష్మి R8 D.No. 22C-11-35, చుండూరివారి వీధి, పవర్‌పేట, ఏలూరు.
10. తోట వాణిశ్రీ, W/o అత్మూరి శ్రీనివాస నవీన్ రిప్రజంటెడ్ బై తోట లక్ష్మి, R8 D.No. 22C-11-35, చుండూరివారి వీధి, పవర్‌పేట, ఏలూరు.
11. కుంచె నాగజ్యోత్నదేవి, W/o బాదర్ల నాగ భాస్కర్, సారది మేన్షన్ అపార్ట్‌మెంటు, ఫ్లాట్ నెం. 401, చెన్నకేశవుల రంగారావు వీధి, పవర్‌పేట, ఏలూరు.
15. మున్నా భారతి, W/o మున్నా రామకృష్ణారావు, ఫ్లాట్ నెం. G1, సాయి దర్శిని అపార్ట్‌మెంటు, మిర్జాలగూడా, సికింద్రాబాద్, తెలంగాణ రాష్ట్రం.
17. తోటా గణపతిరావు, S/o కృష్ణమూర్తి, D.No. 37-93-69/1, రోడ్ నెం.3 మధురానగర్ కాలనీ, నేరేడుమెట్ట, మల్కాజ్‌గిరి, హైదరాబాద్.
19. లక్కాకుల ఉమా మహేశ్వరి D/o సత్యనారాయణమూర్తి, మాధవరం, తాడేపల్లిగూడెం మండలం, ప॥గో॥జిల్లా .
వారలకు పై అప్పీలులో పై కోర్టులో **ది. 3-02-2025 తేదిన ఉదయం 10.30 లకు** స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ ఆక్షేపణలు తెలియపర్చుకోనవచ్చును. లేని యెడల సదరు అప్పీలు తమ పరోక్షమున విచారణ చేయుదురని ఇందుమూలముగా తెలియచేయడమైనది.

నరుకుళ్ళ కృష్ణమూర్తి
ఏలూరు అడ్వకేట్, అశోక్‌నగర్
ది,20-01-2025 ఏలూరు, ఏలూరు జిల్లా